"జీనా యహా మర్నా యహా.

ఆఫీసు గదిలో అశోక్ రాయడం ఆపు జేసి తలెత్తాడు.

కిచెన్‌లోనించి సృజన గొంతు సన్నగా వినబడుతోంది.


టైము చూసుకున్నాడు. పావు తక్కువ తొమ్మిది.

పిల్లలు స్కూలుకి వెళ్ళిపోయారు. నిశ్శబ్దంలో ఆమె పాట హృదయాన్ని తాకుతోంది.

వంట గదిలో నికీతాషా వంటే ఒక తమాషా అనుకుంటూ హుషారుగా వంట చేయక అంత బాధాకరమైన పాట ఏమిటో అనుకున్నాడు. ఆమె స్వరంలో అంత ఆర్ద్రత-గుండెలో గూడుకట్టుకున్న విషాదం కరిగి ప్రవహిస్తున్నట్లు. ఎడారిలో నీటి బిందువు కోసం అలమటిస్తున్నట్లు ఛ విషాదం కాదు; ఆ పాటే అంత.

"డీ. టు కామత్ అండ్ కామత్ థాంక్స్ ఫర్‌ది లెటర్ అయామ్ హై లీ..." ఆఫీసు పనిలో మునిగిపోయాడు అశోక్.

"కాఫీ తీసుకోండి."



# రైవల్

తీసుకునే ముందు అతని దృష్టి వాచీమీద పడింది. తొమ్మిదీ- నాలుగు నిమిషాల యాభైఅయిదు సెకండ్లు.

టైమ్ మెయింటెయిన్ చెయ్యడంలో సృజన బిగ్‌బెన్.

ఇద్దరూ చెరో కప్పూ అందుకొని సోఫాలో కూర్చున్నారు.

కాఫీ బాగుంది అని అతను అనడు. ఎప్పుడూ బాగానే ఉంటుందిగా . అరిటాకులో చెంగల్వపూలు ప్రోగు వేసినట్లున్న ఆమెను చూసి- 'ఈ చీరలో నువ్ బాగున్నావ్, సృజనా' అనికూడా అనడు. ఏ చీరలోనైనా ఆవిడ అందంగానే ఉంటుంది- రోజూ చూసే కొబ్బరి మొక్కలాగ.

"సాయంత్రం ఎక్కడికయినా వెళ్ళాలా?" ప్రోగ్రామ్ ఫిక్స్ చేసేది అప్పుడే.

"అక్కర్లేదు. పిల్లలు జూకి వెళ్తారుట స్కూల్లో."

"నువ్వు... ఫ్రెండ్సెవరయినా వస్తారా!"

"లేదు. రెస్టు తీసుకుంటాను."

"ఓ కె... ఓకె. బై వస్తాను."

తొమ్మిది గంటల తొమ్మిది నిమిషాల ఇరవయ్యొనిమిది సెకండ్లు. అతని వెనక సృజనకూడా బయటికి వచ్చింది.

డ్రైవర్ శ్రీఫకేసని వినయంగా అందుకొని కారు డోర్ తెరిచాడు.

"నమస్కారం, సార్!" ఒక యువకుడు గబుక్కున ఎదర కొచ్చి, రెండు చేతులతోనూ చెప్పిన పని చేసి చూపెట్టాడు.

"నిన్న ఇంటర్వ్యూ కొచ్చేవు కదూ" ప్రశ్నించాడు అశోక్- అతని వైపు నిమిషంలో ఆరో వంతు నిశితంగా చూసి.

"అవునండీ. మీ రెలాగైనా ఆ ఉద్యోగం నాకిప్పించాలి. చాలా అవసరం ,సార్! మా నాన్నగారు రిటైరయిపోయారు."

"మీ తమ్ముడు చదువు కుంటున్నాడు. మీ చెల్లికి పెళ్ళికావాలి. మీ అమ్మగార్కి... ది లిస్ట్ ఈజ్ ఎండ్‌లెస్" అన్నాడు అశోక్, మధ్యలో అందుకొని కొంచెం విసుగ్గా.

"అలాగనకండి, సార్!" అతని గొంతు చాలా ప్రాధేయ పూర్వకంగా ఉంది.

"నువ్ మోహన్‌రావు కదూ!" సృజన గుర్తు పట్టినట్టుగా చటుక్కున అంది వెనకనించి.

మోహన్‌రావ్ తలెత్తి చూసి- "అరె ...సృజనగారా! నమస్కారమండీ" అన్నాడు ఆశ్చర్యంగా, నమ్రతగా.

అశోక్ ప్రశ్నార్థకంగా చూశాడు. నుదుటి మీద గీత పడింది.

"నేను సృజనగారికంటే ఒక సంవత్సరం సీనియర్నండీ కాలేజీలో." చెప్పాడు మోహన్రావ్.

"ఇస్సీ! ఈ విషయం నిన్న తెలిసినా బాగుండేది. ఆ సెలెక్షన్ నిన్ననే అయిపోయింది" అన్నాడు అశోక్.

"పోన్లెండి, సార్! అదృష్టం లేదు. వెళ్తానండి." మోహన్‌రావ్ నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

అశోక్ వాచీ చూశాడు. పదకొండు నిమిషాల ముప్ఫయి సెకండ్లు.ఒకటిన్నర నిమిషం లేటు. కారు స్టార్టయింది.

సృజన ఇంట్లోకి నడిచింది. ఫ్లవర్ వాజులోని విచ్చిన గులాపాల సౌరభాన్ని గుండెలనిండా పీల్చుకుంది.

"పగలే వెన్నెలా జగమే ఊయలా కదిలే ఊహలకే కన్నులుంటే..." కూనిరాగం తీస్తూ శోఫాలో వాలింది.

మోహన్‌రావ్!

×× ×× ××

కాలేజీలో జనరల్ సెక్రటరీగా పోటీ చేశాడు.

ఆడపిల్ల లందరూ అతన్ని సపోర్ట్ చేసి గెలిపించారు. ఓట్లడగడానికి వచ్చి, "బై బిలవ్డ్ సిస్టర్స్ అండ్ బ్రదర్స్ ఆఫ్ మై ప్రెస్టీజియస్




కాలేజ్..." అంటూ గంభీరంగా వివేకానందుడి లెవెల్లో మొదలు పెట్టబోయాడు.

"మీరు స్పీచ్ లివ్వనంటే మా ఓట్లన్నీ మీకే!" వెనకనించి అచ్చుత అంది.

"ఓ.కె. ఓట్లిస్తానంటే స్పీచ్ లెందుకు? మీ అందరికీ నా నిశ్శబ్ద నమస్కారం" అంటూ చేతులు జోడించాడు.

"మన నిశ్శబ్ద నమస్కారం- ఎన్. ఎన్. " అంటూ నిక్ నేమ్ పెట్టేశారు అమ్మాయిలు.

అందమైన అల్లరి. నవ్వుల వల్లరి. ఆనందాల పందిరి.

తన అందానికి మిస్ కాలేజీగా ఎన్నుకొని బ్యూటీ క్వీన్ బిరుదు ఇవ్వలేదు గానీ. అంతకంటే అపురూపమైన ముద్దు పేరు 'క్వీన్ గుల్నార్'. ఆ రోజు ఇంగ్లీషు లెక్చరర్ 'క్వీన్స్ రైవల్' పద్యం చెప్తున్నారు. క్వీన్ గుల్నార్ అందంగురించి వర్ణిస్తుంటే ఆ కుర్ర మాస్టారికి ఎమోషన్ వచ్చేసింది.

గదంతా సన్నజాజుల సౌరభంలా వ్యాపించిన ఆ భావ సంపుటి వినే వారికీ- చెప్పేవారికీ మధ్య తాదాత్మ్యం సిద్ధింపజేసింది.

ఆ క్వీన్ గుల్నార్ అద్దం ముందు కూర్చొని- "నా అంత అందగత్తె లెవరైనా ఉన్నారా?" అని

అడుగుతుంది.

ఉన్నారని అబద్ధం చెప్పేటంత సాహసం ఎవరికీ ఉండదు. ఆఖరికి-గుల్నార్ కూతురు నాలుగేళ్ళ పాపను అద్దంలో చూపించి, "ఇదిగో నీ రైవల్" అంటాడు. గుల్నార్ సంతృప్తిగా పాపను ఎత్తుకొని ముద్దులాడుతుంది.

మాతృత్వంలోని మమకారాన్ని, తల్లి కూతురికిచ్చే వారసత్వ సౌందర్యాన్నీ వింటుంటే విద్యార్థినులందరూ రకరకాల భావసంచయంలో మునిగిపోయారు.

"ఇదిగో...గుల్నార్! మిమ్మల్నే..."

సృజనకు కించిత్ గర్వం కలిగింది. వెనక్కి చూడాలని అనిపించినా చూడలేదు.

మర్నాడు శ్యామల చెప్పింది-"మన గారిబాల్డీ ముఠా నీకు క్రొత్తగా నామకరణంచేసిన చాక్లెట్లు పంచారు."

అతను ఎక్కువగా ఎర్ర చొక్కా వేసుకుంటాడని అతనికి లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో గారిబాల్డీ అని నామకరణం జరిగింది.

"ఒక శుభ వార్త చెప్తున్నాను వినండి-తాజా వార్త-ఎవరికీ తెలియదు ఇంతవరకూ."

"చెప్పవే-బోడి సస్పెన్సూ, నువ్వూనూ."

"నో- నేను చెప్పను. నాది బోడి సస్పెన్సా!" అలిగేసింది అర్పణ.

"కాదే, బాబూ,బోడి సస్పెన్సు కాదు. సస్పెన్స్ థ్రిల్లర్. రొమాంటిక్ సైకో సస్పెన్స్ టెర్రర్ స్టోరీ. నువ్వు అపర హిచ్‌కాక్‌వి. టెంపోరావ్‌వి. చెప్పమ్మా తొందరగా!" అమ్మాయిలు బ్రతిమాలారు.

"మన నెపోలియన్ బోనపార్టే, సి. బి. జడ్. కుసుమ కుమారీ నిన్న రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నారట." చెప్పేసింది అర్పణ.

"ప్రేమ వివాహాలు..."

"వర్ధిల్లాలి."

"వరకట్నాలూ..."

"నశించాలి."

"అట-అంటున్నావ్. ఇది వదంతి కాదుకదా?!" జయజయధ్వానాల తరువాత అడిగింది అనుమానాల భాగ్యలక్ష్మి.

"శుభం పలకరా మంకెన్నా అంటే-ఏదో అందట నీలాంటిదే. మా అన్నయ్య స్వయంగా సాక్షి సంతకం చేశాడుట. చాలా... ఇంకేమైనా ఆధారాలు కావాలా?!"

"మనం కాలేజీలో అభినందన సభ ఏర్పాటు చేద్దాం."

"కాలేజీలో నామకరణాలూ, పెళ్ళి చూపులూ బాగానే జరిగిపోతున్నాయి. అసలు కాలేజీలో ఒక కల్యాణ మండపం కూడా ఏర్పాటుచేసి పూర్వ విద్యార్థులు కానీ, ఇప్పటి విద్యార్థులుకానీ మేం కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటాం అంటే ఎంకరేజ్ చేసి వివాహాలు చేయిస్తే బావుంటుందేమో!" ఒక సలహా పారేసింది సోషియాలజీ కమల.

"చూశావా- అందులోనే మన వెనుకబడినతనం కనబడుతోంది" అంది ఇందిర.

"ఏమిటే, ప్రేమించి పెళ్ళిచేసుకోవటం వెనకబడినతనమా?"

"ఒకవిధంగా చూస్తే అంతే" అంది బూర్జువా భవాని.

ఆ అమ్మాయి రోజూ కార్లో వస్తుందని ఆ నిక్ నేమ్ తగిలించారు.

"మనవాళ్ళకు ప్రేమ పెళ్ళిళ్ళ మీద మంచి అభిప్రాయం లేదు. వాళ్ళను ఇటువైపు పేరెంట్సు, అటువైపు పేరెంట్సూ కూడా వెలేసినట్లు చూస్తారు. పెళ్ళికూతుర్ని- భలే వలేసి పట్టింది, మంచి తెలివయింది- అంటారు. ఆ విధంగా మనకు రావలసిన ఆస్తిపాస్తుల మీద హక్కు వదులుకున్నట్టే" అంది చిరు చెమటలను తుడుచుకుంటూ.

"అంటే లా మేరేజస్ అన్నవి కొంత మాడిఫైడ్ పద్ధతిలో జరగాలి అంటావ్- అంతేనా!" సూటిగా అడిగింది శశిరేఖ.

"అవును. పెళ్ళికొడుక్కి ఉద్యోగమో, వ్యాపారమో ఎలాగయితే తప్పనిసరో-అదేవిధంగా పెళ్ళికూతురిక్కూడా ఉద్యోగమో, పుట్టింటి వారిచ్చిన ఆస్తో... ఏదో ఒకటి తప్పనిసరిగా ఉండాలి. ఏదీ లేకుండా నన్ను పెళ్ళిచేసుకో, పోషించు అనడం ఒక విధంగా మనల్ని మనం న్యూనతపరుచుకోవడమే" అంది ఆవేశంగా భవాని.

"కానీ పెళ్ళి చూపుల తతంగాలూ, పెళ్ళికి భారీ ఖర్చులు చేయడం, ఇటువంటివిమాత్రం ప్రేమ పెళ్ళిళ్ళ వల్ల తగ్గుతాయి."

"పెళ్ళిళ్ళ విషయంలో ఆడవాళ్ళు చాలా నిస్సహాయంగా ఉంటున్నారు, ఆ పద్ధతి మారాలి."


రీడర్స్ నావెల్టీకి
శ్రీ మహాలక్ష్మీ వారి
వెరైటీ నవలలు!

మే 25న విడుదలయ్యాయి!
ధర్మయుద్ధం (ఆంధ్రభూమి సీరియల్)
మల్లాది వెంకటకృష్ణమూర్తి - రూ.25/-
ఈ తరం స్త్రీ (స్వాతి వీక్లీ సీరియల్)
రమణీ మణి — రూ.25/-
నాతి చరామి (పునర్ముద్రణ)
మల్లాది వెంకటకృష్ణమూర్తి - రూ.16/-
ఆత్రేయ నాటికలు-
— రూ.15/-

Bachi

మీరు చదివారా?
మల్లాది వెంకట కృష్ణమూర్తి
నవలలు!

రెండు రెళ్ళు ఆరు — రూ.20/-
చంటబ్బాయ్ — రూ.25/-
నక్షత్రాలొస్తున్నాయి జాగ్రత్త — రూ.20/-
పెద్దలకు మాత్రమే — రూ.20/-
రేపటి కొడుకు — రూ.15/-
నాతిచరామి — రూ.16/-
లిటిల్ రాస్కెల్ — రూ.20/-
ప్రేమిస్తే ఏమవుతుంది? — రూ.15/-
మృత్యువాగదు — రూ.15/-
మేఘమాల — రూ.17/-
ఈ గంట గడిస్తే చాలు — రూ.20/-
కొత్త శత్రువు — రూ.15/-
స్రవంతి — రూ.15/-

కావలసిన పుస్తకాల ధరలో రూ.1/- తగ్గించి M.O. చేస్తే ఆ రూపాయికి V.P.P.లో పంపుతాము.

శ్రీ మహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్, విజయవాడ-2 ఫోన్: 63322

"ఎవరు మారాలి- పెద్దలా, పిన్నలా?" లావణ్య లా పాయింట్ లాగింది.

"ముందు పిన్నలు మారాలి. తరువాత పెద్దల్ని మార్చాలి."

"అంటే ఇప్పుడు కుసుమ కిద్దామనుకున్న స్థిరచరాస్తులు, చీరలు-అన్నీ ఇచ్చి వేరే కాపురం పెట్టించి పెద్దలు ఆదుకోవాలి."

"అని కాలేజీ విద్యార్థినులందరూ తమ వెయిటింగ్ రూమ్ సమావేశంలో తీర్మానించడమైనది. ఈ తీర్మానం యొక్క కాపీని కాలేజీ విద్యార్థీ విద్యార్థినులు వారి తల్లితండ్రులకు సమర్పించాలి" అని ముగించింది గర్ల్స్ రిప్రజంటేటివ్.

×× ×× ××

సృజన ఆలోచనల్లోంచి లేచి నిలబడింది. కిటికీ ఊచలు పట్టుకొని నిలబడింది. తోటలో విరగబూసిన మందారాలు.

మందారాలు చూడగానే సరళ జ్ఞాపకం వచ్చింది. రకరకాల వస్తువులు రోజు కొకటి తెచ్చి అడిగినా, అడగకపోయినా- మీ బావ ఫారిన్నించి తెచ్చాడు అనేది.

"ఈ నోట్సెంత బావుందేమిటే-మీ బావ ఫారిన్నించి తెచ్చాడా?"

"ఆ తెస్తే తెచ్చాడు మీకేం?" ఉడుక్కునేది సరళ.

"'సంపదా! అబ్బ ముద్ద మందార. అబ్బే-హైబ్రిడ్ రోజా సెనా సిన్-మీ బావ ఫారిన్నించి తెచ్చాడా?" సరళ ఉడుక్కోవాలని.

"మా బావ ఫారిన్లో లేడు. ఈ చెట్లూ ఫారిన్లో లేదు. మాదొడ్లో ఉంది-కావలిస్తే వచ్చి నువ్కూడా చూసుకో."

"మన ఎకనమిక్స్ మేడం గారి చీర చూసేవా, సింధు నాగరికత కాలం నాటి దట."

వీళ్ళ కబుర్లేని విషయం లేదుకదా! అన్నింటికీ కామెంట్లే. అన్నింటికీ నవ్వులే. నవ్వడానికి ఏదో కారణం. అయినా కారణం ఎందుకు? నవ్వులే జీవితంగా రోజులు నిమిషాల్లా గడిచిపోయే ఆ రోజులకూ, ఇప్పటికీ ఎంత అంతరం.

ఇది తరతరాల అంతరం కాదు. స్వభావాల అంతరం-నిట్టూర్చింది సృజన.

అతను తన మెడలో కట్టింది మంగళసూత్రం కాదు. ఒమేగా గడియారం. గడియారం ఎంత ఖరీదైనదన్నా దాని పని టైమ్ చూపించడమేగా!

ఆరింటికి బెడ్ కాఫీ-గుడ్ మార్నింగ్. ఎనిమిదింటికి-మెర్రీ బ్రేక్ఫాస్ట్. పిల్లలు స్కూలుకి,అశోక్ ఆఫీసు రూమ్. తొమ్మిదికి ఆయన పని పూర్తవుతుంది. తొమ్మిదీ అయిదు ఎ కప్ ఆఫ్ కాఫీ. ఎ కిస్ ఆఫ్ కన్వెన్షన్. ఎ ఫార్మల్ సెండాఫ్.

మధ్యాహ్నం బి. బి. సి. సెషన్స్— బోర్ భార్యల కార్డ్ సెషన్స్. మధ్యలో అభాండాలు, విమర్శలు, ఎత్తిపొడుపులు. బడాయిలు, కుసంస్కారం. నాలుగింటికి తల నొప్పి.

భూమధ్యరేఖా మండలపు మార్పులేని వాతావరణంలా-మార్పులేని దిన చర్య. మనస్ఫూర్తిగా నవ్వుకో గలిగే సన్నివేశాలు తక్కువయిపోయి మనసు నావహించు కుంటున్న నిర్లిప్తత...జీనా యహా మర్నా యహా.

కాలింగ్ బెల్ సంగీతం.

"మమ్మీ!గుడీవెనింగ్!"

"గుడీవెనింగ్. అక్కేది?"

"జూకి వెళ్ళాంకదా. తను బస్- సిలో వస్తుంది."

"ఐ సీ."

"కమాన్, మమ్మీ! టిఫిన్ అండ్ మీల్స్-నో టైం టు వేస్ట్."

'నా తండ్రే. తండ్రిని మించిన తనయుడివిరా. టైం కీపర్స్ ఆఫ్ ఇండియా!' నిట్టూర్చింది చిన్నగా.

అయిదున్నరయింది. గీత ఇంకా రాలేదు. టైము తక్కువే అయినా, చీకటి పడుతోంది. జూలోనుంచి బయటికి వచ్చారో, లేదో?అక్కడ పాములూ అవీ ఉంటాయి.

సృజన తలుపుతీసి బయట నిలబడింది.

కాసేపట్లో సైకిలుమీద గీత. "ఇదుగోనండీ మీ రైవల్. కండెక్టర్ క్రొత్తట- అవతల వీథిలో దించేశాడు!" అది మోహన్రావ్ గొంతు.

'నా రైవల్!' సృజన హృదయం చిత్రంగా స్పందించింది.

గీతని ఎత్తుకుని గుండె కదుముకుంది. పాల బుగ్గలమీద ప్రేమగా ముద్దులు పెట్టింది.

రెక్కలు పట్టుకొని గిరగిరా త్రిప్పింది. కితకితలు పెట్టి నవ్వించింది. పాపతోపాటు తనూ పకపకా నవ్వింది. ఎత్తుకునే లోపలికి తీసికెళ్ళి బాదం కేక్ అందించింది.

"జగమే మారినదీ మధురముగా ఈ వేళా కలలూ కోరికలూ తీరినవీ మనసారా-మనసాడనే మయూరమై..."

అశోక్కి గుమ్మంలోనే వినపడింది.

హుషారైన కమ్మని గొంతు. కంఠంలో ఉత్సాహం ఉరకలు.

వేడి వేడి కాఫీ చేతికిచ్చి, కమ్మని భావమే కన్నీరై పారగా ప్రియమగు చెలిమీ-సాటిలేని కలిమీ!

పాట ఆగలేదు. బెడ్రూమ్లోనించి తెరలుతెరలుగా వస్తోంది. అద్దంముందు సృజన. అశోక్ వెనక నిలబడ్డాడు. పదవీ భారాన్నంతా తనే మోస్తున్నట్టు వెనక్కి పోతున్న జుట్టు. అందమైన చీరలో-అపర రతీదేవిలా సృజన. ఉత్సాహంతో ఉబికిన చెక్కిళ్ళు.

"బ్యూటిఫుల్!" అప్రయత్నంగానే అన్నాడు అశోక్.

"గీత-మా రైవల్ అట. మోహన్రావ్ అంటున్నాడు."

"మై డార్లింగ్ గుల్నార్!" సృజనని తన వైపుకు త్రిప్పుకున్నాడు ప్రేమగా.

ఇంకో అరగంట పోయాక-

సృజన కిచెన్లో డిన్నర్ తయారు చేస్తోంది.

"హలో-వెంకట్రావుగారేనా?"

"ఎస్సార్!" నమ్రతగా పలికేడు మేనేజర్.

"నిన్న ఇంటర్వ్యూ చేశాం చూడండీ..."

"ఎస్సార్."

"అందులో మోహన్రావ్ జి. అని ఒక అప్లికేషనుంది. పోస్టుగ్రాడ్యుయేట్-ఆ. అతడికి పోస్టింగిచ్చి మన విజయవాడ బ్రాంచికి వెయ్యాలి."

"అలాగే, సార్! మరి చలపతిరావుని...?"

"అతణ్ణి మన ఆఫీసులోనే ఉంచుదాం. మోహన్రావు నాకు రైరిలెటివ్.తప్పదు పోస్టింగివ్వాలి."

"సరే, సార్!ఆర్డర్ టైప్ చేయించుతాను,సార్!"

"మంచిది. థాంక్యూ."

"జగమే మారినదీ మధురముగా ఈ వేళా..." రిలీఫ్గా కూనిరాగం తీశాడు అశోక్ ఫోన్ పెట్టేసి.

